సాక్షి నిజామాబాద్

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



పేదల అవసరాలు తీర్చే బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల అవసరాలు తీర్చేదని ఎస్‌వైకే మాజీ చైర్మన్ పేరాల చంద్రశేఖర్ అన్నారు.

- 8లో ▸



ప్రాణం తీసిన ఓవర్‌టేక్

పోతంగల్–కోటగిరి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.4 /17.3

పొగ మంచు కురుస్తుంది. మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లారీని ఢీకొట్టిన బస్సు

- డ్రైవర్‌తో పాటు మరో 15 మందికి గాయాలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ప్రైవేట్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్‌తో పాటు మరో 15 మందికి గాయాలయ్యాయి. రాయ్‌చూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పెర్కిట్ శివారులో అదే మార్గంలో మక్కల లోడ్‌తో వెళ్తున్న లారీని వెనక నుంచి అతివేగంలో ఢీకొట్టింది. అనంతరం అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ క్యాబిన్ ఇరుక్కుపోయాడు. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణిలకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాల పాలైన డ్రైవర్‌ను, ప్రయాణికులను ఆర్మూర్‌తో పాటు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. క్రెయిన్ సహాయంలో బస్సును రహదారిపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు పేర్కొన్నారు.

మేనమామ వేధింపులే కారణం..!

- సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని



అభిజ్ఞగౌడ్(ఫైల్)

భిక్కనూరు : మేనమామ వేధింపుల కారణంగానే కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అభిజ్ఞగౌడ్(23) ఆత్మహత్య చేసుకుంది. తనకు వరుసకు మేనమామ అయిన నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం డొంకేశ్వర్‌కు చెందిన సందీప్‌గౌడ్ మానసికంగా వేధించడంతోనే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మృతురాలు సూసైడ్ నోట్‌లో పేర్కొంది. తాటిపాముల కిరణ్ కుమార్‌గౌడ్, స్వప్నల కుమార్తె అభిజ్ఞగౌడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం ఆమె కామారెడ్డిలో స్థిరపడిన తల్లిదండ్రుల వద్ద ఉంటూ వర్క్‌ఫ్రం హోమ్‌గా విధులు నిర్వహించేది. అభిజ్ఞ కామారెడ్డి లోని ఇంట్లో గురువారం ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. మేనమామ మానసిక వేధింపులు ఎవ్వరికీ చెప్పుకోలేక పోయానని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కామారెడ్డి నుంచి భిక్కనూరుకు శుక్రవారం తీసుకొచ్చారు. మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

20న తెయూలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ లా కాలేజ్ సెమినార్ హాల్‌లో ఈ నెల 20న 'విక్టిమ్స్ ఆఫ్ ట్రాఫికింగ్ అండ్ కమర్షియల్ సెక్స్‌వల్ ఎక్స్‌ప్లొటేషన్ స్కీం -2015' అనే అంశంపై లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోర్టుకు చెందిన ప్రముఖ న్యాయవాదులు ప్రసంగిస్తారని, న్యాయ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



విద్యుత్ వెలుగుల్లో బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయం



శివరాత్రికి ముస్తాబైన జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం



శివపూజకు వేళాయె..

మహా శివరాత్రి.. 'శివం' అంటే శుభం. శుభాలను ఇచ్చేవాడు శివుడు. ఆ దేవాది దేవునికి 'లింగోద్భవ' ఆవిర్భావ కాలమే మహా శివరాత్రి. ఈ జగత్తుకే సమస్త శుభాలను కలిగించే రాత్రి శివరాత్రి. అందుకే ఈ రోజున భక్తులు ఎంతో నిష్ఠతో స్వామి వారిని కొలుస్తారు. కఠిన ఉపవాసంతో ముక్కంటిని ఆరాధిస్తారు. శివునికి ప్రీతికరమైన ఈ రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఇందుకోసం జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాల్లో దేదీప్యమానంగా వెలుగులీనుతున్నాయి. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, స్వయంభూ శంభు లింగేశ్వరాలయం, ఉమామహేశ్వరాలయం, శ్రీమల్లికార్జునస్వామి ఆలయం, బోధన్‌లోని ఏక చక్రేశ్వరాలయం, లొంకలోని రామ లింగేశ్వరాలయం, నందిగుట్టలోని శివాలయం తదితర ఆలయాల్లో శివ కళాణోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. శివ రాత్రి సందర్భంగా నగరంతో పాటు పట్టణాల్లోని మార్కెట్లు పండ్ల అమ్మకాలతో సందడిగా మారాయి.

– నిజామాబాద్ సిటీ

శనగ రైతుకు దిగుబడి దెబ్బ!



గింజలు కాని శనగను చూపుతున్న రైతు

ఈ ఏడాది యాసంగిలో సాగు చేసిన శనగ పంట దిగుబడులు పడిపోయి రైతులను నిరాశకు గురి చేసింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించినప్పటికీ చీడపీడలు సోకి పంటను దెబ్బతీశాయి. సాగు పెట్టుబడి ఖర్చులు పోనూ ఏమీ మిగులుబాటు ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్షం రోజుల క్రితం జిల్లాలో శనగ పంట కోతలు, నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. దిగుబడులు రైతుల ముంగిట్లోకి చేరుతున్నాయి.

చీడపీడలు సోకి తీవ్ర నష్టం

- ఎకరానికి 5 క్వింటాళ్లు రానిపరిస్థితి
- మద్దతు ధరకంటే తక్కువకు కొంటామంటున్న దళారులు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కోసం కర్షకుల ఎదురు చూపు



రెంజల్ మండలం బోర్గాం శివారులో ఎండిన శనగ పంట

బోధన్/రెంజల్ : జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో శనగ పంట సాగయ్యింది. బోధన్, రెంజల్, కోటగిరి, నవీపేట మండలాలతో పాటు, నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజక వర్గంలోని పలు మండలాల్లో రైతులు శనగ సాగు చేశారు. మంజీర, గోదావరి నదుల పరీవాహక ప్రాంతంలోని బోధన్, కోటగిరి, రెంజల్ మండలాల్లోనే అత్యధికంగా పంట పండించారు. బోధన్ మండలంలో 11 వేల 735 ఎకరాల్లో సాగైంది. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఈ సారి 4 నుంచి 5 క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తోంది. నీటి లభ్యత ఉన్న మెట్ట భూముల్లో 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎకరానికి దుక్కి, విత్తు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, నూర్పిళ్లకు సుమారు రూ. 20 వేలకు మించి ఖర్చు పెట్టారు.

దళారుల రంగ ప్రవేశం

వారం పది రోజుల నుంచి పంట నూర్పిళ్లు పూర్తి చేసుకుని రైతులు ఖాళీ ప్రదేశాల్లో శనగను అరబెడుతున్నారు. పంట కొనుగోలుకు దళారులు, కమీషన్ ఏజెంట్లు రైతులతో సంప్రదింపులు జరుపుతు న్నారు. మార్కెట్లో క్వింటాలుకు రూ. 4,700 ధరకు కొంటామంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ. 5,335 ప్రకటించడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ఎదురు చూస్తున్నారు. కాగా శనగ పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు 12 సొసైటీల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు మార్క్‌ఫెడ్ సమాయత్తమైంది.



సాలూరలో శనగ పంటను అరబెడుతున్న రైతులు

త్వరలో కొనుగోలు కేంద్రాలు

జిల్లాలోని సొసైటీల్లో 12 కొనుగోలు కేంద్రాలను అతిత్వరలోనే ప్రారంభిస్తాం. ఇప్పటికే సొసైటీల నిర్వాహకులకు మార్గదర్శకాలు సూచించాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి శనగ కొనుగోలు చేస్తాం. – రంజిత్ కుమార్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లాఅధికారి, నిజామాబాద్

ఐదు క్వింటాళ్లే వచ్చింది



నా సొంత మెట్ట భూమి రెండున్నర ఎకరాలతో పాటు 12 ఎకరాల కౌలు భూమిలో శనగ సాగు చేశా. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించగా, ఐదు క్వింటాళ్లే వచ్చింది. ఎకరం పంట సాగుకు రూ. 20 వేలవరకు ఖర్చు పెట్టా. ఎకరం కౌలు రూ. 24వేలు ఉంది. తగ్గిన దిగుబడితో పెట్టుబడులకు సరిపోతే భాగ్యమనుకుంటున్నాను.

– సంగెపు భూమయ్య, రైతు, సాలూర

మద్దతు ధర కంటే తక్కువకు..



నా సొంత మెట్ట భూమి 15 ఎకరాల్లో శనగ సాగు చేశా. ఎకరానికి దిగుబడి 7 క్వింటాళ్లవరకు వచ్చింది. వారం పది రోజులుగా సొసైటీ స్థలంలో ఆరబెడుతున్నాను, దళారులు క్వింటాలుకు రూ. 4,700 లకు కొంటామని వచ్చారు. సొసైటీ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని నిర్ణయించుకున్నాను. పంటకు సోకిన తెగుళ్ల వల్ల పంటదిగుబడి పడిపోయింది. ఆశించిన దిగుబడి రాలేదు.

– శివకాంత్ పటేల్, రైతు, సాలూర

త్వరగా ప్రారంభించాలి



శనగ పంట దిగుబడులు రాక రైతులకు పెట్టుబడులు కూడా మిగలడం లేదు. రైతులకు దెబ్బమీద దెబ్బలా దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

– ఎంఎల్ రాజు, రైతు

జంట వ్యాధుల ముప్పు

- జిల్లాలో పెరుగుతున్న బీపీ, షుగర్ బాధితులు
- గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ



నిజామాబాద్ సిటీ : జిల్లాలో షుగర్, బీపీ బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఈ మధ్య కాలంలో హైబీపీకి గురైన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఎన్ఐఎన్ (జాతీయ పోషకాహార సంస్థ) సర్వే ప్రకారం ప్రస్తుతం జిల్లాలో బీపీ 77,892 మంది, షుగర్ 36,221 కేసులు ఉన్నాయి. ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోక పోవటం, తినే ఆహారంలో నియమాలు పాటించక పోవటం, మోతాదుకు మించి ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకునే వారు బీపీ వ్యాధి బారిన పడుతున్నారు. 2021లో జిల్లాలో 56,602 మందికి బీపీ ఉండగా, 2023కు వచ్చేసరికి 77,892 మందికి బీపీకు గురైనవారు ఉన్నారు. అంటే మూడేళ్లలో 21,290 మంది బీపీ పేషంట్లు పెరిగారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు జిల్లా వైద్యశాఖ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. బీపీ 140/90 కంటే ఎక్కువ ఉంటే అధికంగా ఉన్నట్లు, షుగర్ ఫాస్టింగ్ 126 కంటే ఎక్కువ ఉంటే మధుమేహం ఉన్నట్లు లెక్క. షుగర్, బీపీలు గలవారు తగినంత శారీరక శ్రమ చేయాల్సి ఉంది. అలాగే మంచి ఆరోగ్యవంతులు నిత్యం గంటపాటు శారీరక వ్యయామం లేదా, యోగా చేసినట్లయితే ఈ రెండు వ్యాధులకు గురికాకుండా ఉంటారని వైద్యులు సలహాలు ఇస్తున్నారు. ఆహారం రుచికొరకు తీసుకుంటున్న ఉప్పును తగ్గించటం ద్వారా బీపీ నియంత్రణలో ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

2022-23లో.. (ఎన్ఐఎన్ సర్వే)

వ్యాధి	పట్టణాలు	గ్రామాలు	మొత్తం
షుగర్	11,784	24,437	36,221
బీపీ	26,118	51,774	77,892

జిల్లా వ్యాప్తంగా గణాంకాలు

సంవత్సరం	షుగర్	బీపీ
2020-21	23,582	56,602
2021-22	26,380	57,787

సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్సీ వీజీగౌడ్

డిచ్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ అన్నారు. డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లిలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి మోడల్‌ను దేశ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారన్నారు. పంజాబ్ సీఎం స్వయంగా వచ్చి తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి తమ రాష్ట్రంలో అమలు చేస్తామని చెప్పడం ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను, బీఆర్ఎస్‌ను ప్రజలు ఆశీర్వదించి వెన్నంటి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తేలు గణేశ్, ఎంపీటీసీ బాల గంగాధర్, ఉప సర్పంచ్ సరస్వతి కిషన్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు లక్కవత్రి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.



మిట్టాపల్లిలో పద్మశాలి సంఘం కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వీజీ గౌడ్

వైద్య సేవలకు జాతీయ గుర్తింపు

- బాన్సువాడ ఎంసీహెచ్‌కు బీఎఫ్‌హెచ్ఐ(గ్రేడ్-1) అక్రెడిటేషన్
- దేశంలోనే మొదటి ప్రభుత్వ దవాఖానా



బాన్సువాడ ఎంసీహెచ్‌లో సేవలు పొందుతున్న బాలింతలు

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. తల్లి పాలను ప్రోత్సహించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇనిషియేటివ్(బీఎఫ్‌హెచ్ఐ) అందించే బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రెడిటేషన్(గ్రేడ్–1) లభించింది. దేశంలో ఈ గుర్తింపు పొందిన మొదటి సర్కారు దవాఖానా ఇదే కావడం గమనార్హం.

బ్రెస్ట్ ఫీడింగ్‌ను ప్రోత్సహిస్తున్న దవాఖానాలను యూనిసెఫ్ బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్వర్క్ ఆఫ్ ఇండియా (బీపీఎన్ఐ), అసోసియేషన్ ఆఫ్ హెల్త్ ప్రొవైడర్స్ ఇండియా(ఏహెచ్‌పీఐ) సంయుక్తంగా ఎంపిక చేసి బీఎఫ్‌హెచ్ఐ అక్రెడిటేషన్ ఇస్తున్నాయి. పుట్టిన బిడ్డకు అరగంట లోపే ముర్రుపాలు తాగించడంతో పాటు ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే తాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా ఐదేళ్లలోపు పిల్లలలో మరణాలను 22 శాతం నివారించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్రెస్ట్ ఫీడింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఆశ కార్యకర్తల ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రెడిటేషన్ కోసం ఇటీవల ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం బాన్సువాడ ఎంసీహెచ్‌ను సందర్శించింది. అన్ని రకాల ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారించుకుని అక్రెడిటేషన్ మంజూరు చేసింది.

మంత్రి హర్షం..

బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పటల్ ఇనిషియేటివ్(బీఎఫ్‌హెచ్ఐ)లో బాన్సువాడ ఎంసీహెచ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై మంత్రి ప్రశాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీఎఫ్‌హెచ్ఐ అక్రెడిటేషన్ పొందిన దేశంలోనే మొదటి ప్రభుత్వ ఆస్పత్రి కావడం గర్వంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ దవాఖానాలలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయనడానికి ఇది నిదర్శనమన్నారు. వైద్య సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఇది మాకు దేవాలయం..



నాకు పురిటినొప్పులు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం ఆస్పత్రికి వచ్చాం. వైద్యులు, సిబ్బంది ధైర్యం చెప్పి సాధారణ కాన్పు చేశారు. నేను, నా బిడ్డ ఆరోగ్యంగా ఉన్నాం. మాలాంటి గరీబోళ్లకు ఇదో దేవాలయం.

– మహేదేవి, బాలింత, మేనూర్

బైబ్యాక్ ఒప్పందాన్ని ఉల్లంఘించొద్దు

- లేదంటే కఠిన చర్యలు తప్పవు
- దళారులు ఎర్రజొన్నకు సరైన ధర చెల్లించి కొనుగోలు చేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో రైతులు సాగు చేసిన ఎర్రజొన్న పంట బైబ్యాక్ ఒప్పందానికి అనుగుణంగా సీడ్ వ్యాపారులు కొనుగోలు చేసేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాలని, బై బ్యాక్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు ఉంటాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి వ్యవసాయ శాఖ అధికారులతో ఎర్రజొన్న పంట కొనుగోళ్ల ప్రస్తుత స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు నష్టపోవడానికి వీల్లేదని, సీడ్ వ్యాపారులు సిండికేట్‌గా మారి బైబ్యాక్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టంచేశారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ధర చెల్లిస్తూ ఎర్రజొన్న కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎర్రజొన్న పంట దిగుబడులు చేతికందుతున్న దృష్ట్యా అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎర్రజొన్న కొనుగోళ్లపై గట్టి పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఎర్రజొన్న సాగు చేసిన గ్రామాల్లో రైతులతో సమావేశమై, పంట విక్రయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. అదే సమయంలో రైతులతో ఒప్పందం కుదుర్చుకున్న సీడ్ వ్యాపారులను సైతం సంప్రదించి ఎక్కడ కూడా బైబ్యాక్ ఒప్పందం ఉల్లంఘించకుండా, మార్కెట్ రేట్‌కు అనుగుణంగా కొనుగోళ్లు జరిపేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, వాజిద్ హుస్సేన్, ఏడీఏలు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్లుప్తంగా

ప్రజావాణి ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయపల్లి సర్పంచ్‌ శైలజపై ఇటీవల జిల్లాకేంద్రంలోని ప్రజావాణిలో స్థానికులు చేసిన పిర్యాదుపై ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్‌ శుక్రవారం జీపీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సర్పంచ్‌ శైలజ స్థానింగా ఉండకపోవడంతో పాటు జీపీ పరిధిలో ఉన్న అనుబంధ గ్రామమైన రామక్కపల్లికి రావడం లేదని స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో పాటు జీపీ వ్యవహారాల్లో సర్పంచ్‌ మరిది శ్రావణ్‌ అలియాస్‌ రవి పెత్తనం చేస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎల్‌పీవో సురేందర్‌ జీపీలో సర్పంచ్‌ శైలజ, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. స్థానికంగా ఉంటూ జీపీ వ్యవహారాలు చూసుకోవాలని డీఎల్‌పీవో సర్పంచ్‌ శైలజను ఆదేశించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులను అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎంపీవో శ్రీనివాస్‌, పంచాయతీ కార్యదర్శి రమ్యశ్రీ ఉన్నారు.

బాల్య వివాహంపై కౌన్సెలింగ్‌

బోధన్‌టౌన్‌ (బోధన్‌) : పట్టణంలోని 15వ వార్డులో నివాసం ఉంటున్న ఓ మైనర్‌ బాలికకు ఈనెల 23వ తేదీన వివాహం చేస్తున్నారని సమాచారం అందుకున్న ఐసీడీఎస్‌ అధికారులు శుక్రవారం వారి ఇంటికి వెళ్లి తల్లికి, పెళ్లి చేసుకోబోయే మైనర్‌ బాలికకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అమ్మాయికి 16 ఏళ్లు ఉండడం వల్ల వివాహం సరికాదని అధికారులు నచ్చజెప్పారు. మైనారిటీ తీరిన అనంతరం వివాహం చేయవచ్చని తల్లికి వివరించారు. బాల్యవివాహం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కౌన్సెలింగ్‌లో లీగల్‌ అసిస్టెంట్‌ సెంటర్‌ సభ్యురాలు పద్మాసింగ్‌, ఐసీడీఎస్‌ సూపర్‌ వైజర్‌ రాధిక, ఆసియాబేగం, వార్డు కౌన్సిలర్‌ సంగీత, అంగన్‌వాడీ టీచర్‌ విజయలక్ష్మి,ఐసీపీఎస్‌ బాబు,సాయిలు, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ సౌజన్య, బీక్‌సింగ్‌ ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి): వర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో శుక్రవారం ముగ్గురు విద్యార్థులు డిబారైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 10,425 మంది విద్యార్థులకు గానూ 9,564 మంది హాజరు కాగా 861 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే భీంగల్‌ సాయిసిద్దార్థ డిగ్రీ కాలేజ్‌ పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబారైనట్లు ఆమె తెలిపారు.

20 నుంచి బీఈడీ సెమిస్టర్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : వర్సిటీ పరిధిలోని బీఈడీ మూడవ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వర్సిటీ పరిధి లోని అన్ని అనుబంధ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్లు, విద్యార్థులు గమనించాలని, వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ www. telangana university. ac.inను చూడాలని ఆమె సూచించారు.

కొనసాగుతున్న యువకుడి దీక్ష

మద్నూర్‌(జుక్కల్‌) : కలెక్టర్‌ వచ్చి న్యాయం చేసే వరకు తన పోరాటం ఆగదని డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్‌ గ్రామానికి చెందిన నామేవార్‌ లక్ష్మణ్‌ పేర్కొన్నారు. జహీరాబాద్‌ ఎంపీ బీబీ పాటిల్‌ సొంతూరు సిర్‌పూర్‌లో అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన వారు అడ్డుకుంటున్నారని లక్ష్మణ్‌ అనే యువకుడి దీక్ష శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. లక్ష్మణ్‌ చేపట్టిన దీక్షకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్‌గొండ, గ్రామస్తులు మద్దలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో వాగు పక్కకు శ్మశాన వాటిక నిర్మించి ప్రారంభించక ముందే కూలిపోయిందని లక్ష్మణ్‌ పేర్కొన్నారు.

పేదల అవసరాలు తీర్చే కేంద్ర బడ్జెట్‌

- రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మేధావుల అభిప్రాయం



మాట్లాడుతున్న నెహ్రూ యువకేంద్ర మాజీ చైర్మన్‌ పేరాల చంద్రశేఖర్‌

సుభాష్‌నగర్‌ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ పేదల అవసరాలు తీర్చేదని, వారికి పూర్తిగా ఉపయోగపడే బడ్జెట్‌ అని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని నిఖిల్‌ సాయి హోటల్‌లో కేంద్ర బడ్జెట్‌పై మేధావులతో రౌండ్‌ టేబుల్‌ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నెహ్రూ యువకేంద్ర (ఎన్‌వైకే) మాజీ చైర్మన్‌ పేరాల చంద్రశేఖర్‌ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ అన్ని రంగాలు, వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. 2014లో రూ. 18 లక్షల కోట్లుగా ఉన్న బడ్జెట్‌లో ప్రస్తుతం రూ. 48 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. దేశంలోని ప్రతిఒక్కరికి బడ్జెట్‌పై అవగాహన రావాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లాకేంద్రాల్లో అన్నివర్గాల మేధావులతో రౌండ్‌టేబుల్‌ సమావేశాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమయ్యే విధంగా ఏ రంగానికి ఎంత ఖర్చుచేశారు. దానికి అనుగుణంగా మేధావుల సూచనలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టే పథకాలన్నీ అట్టడుగుస్థాయికి చేరాలన్న సంకల్పంతోనే కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బడ్జెట్‌పై ఏ ప్రభుత్వం కూడా మేధావులతో చర్చ జరపలేదని, మోదీ ఆలోచనలను మేధావుల ముందుంచాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. భవిష్యత్‌లో మోదీ ఏ కార్యక్రమం చేపట్టినా.. అందరి సూచనలు తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటారన్నారు. మన చుట్టూ ఉన్న వారికి కూడా బడ్జెట్‌పై అవగాహన తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు దినేష్‌రెడ్డి, పారిశ్రామిక వేత్తలు, న్యాయవాదులు, చార్టెడ్‌ అకౌంటెంట్లు, ప్రజాసంఘాల నాయకులు మోహన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌ సుబేధార్‌, అంబరీష్‌, వెంకటరమణ, వైద్యులు పున్నయ్య, స్వప్న, పంచారెడ్డి లింగం, కొండెల సాయిరెడ్డి, కొండా ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే దళిత బంధు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌



నిజాంసాగర్‌లో కుమ్మరి నారాయణ కష్టాన్ని తెలుసుకుంటున్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

నిజాంసాగర్‌: దళితుల ఓట్ల కోసమే సీఎం కేసీఆర్‌ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని బీఎ స్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ వి మర్శించారు. శుక్రవారం నిజాంసాగర్‌, గోర్గల్‌, మాగి, ఒడ్డేపల్లి గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు యూనిట్లలో అవినీతి జరిగిందని, మధ్యవర్తులు కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. గొల్ల కుర్మలకు రూ. 5 వేలకు ఒక్క గొర్రె చొప్పున అందించగా దళిత బంధులో రూ. 10 వేలకు ఒక్క గొర్రెను అందించారంటే ఏ మేరకు అవినీతి జరిగిందే అర్థం చేసుకోవచ్చన్నారు. దళితులకు అవసరమున్న యూనిట్లు కాకుండా షోరూం ఓనర్లకు లాభదాయకమైన ట్రాక్టర్లను, వాహనాలను అంటగట్టారన్నారు. అధికార పార్టీ నేతల దోపి డులపై ప్రజలు విసిగి వేసారిపోతున్నారన్నారు. మంజీర నదిపైన నాగమడుగు ఎత్తిపోతల పథకానికి సర్వేలు చేయకుండానే పనులు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బీఎస్పీకి అధికారం ఇస్తే పారదర్శకమైన పాలన అందిస్తామన్నారు. కార్యక్రమాలలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్‌, జిల్లా ఇన్‌చార్జి గంగారాం, నాయకులు సురేశ్‌గౌడ్‌, సాయిలు, ప్రజ్ఞకుమార్‌, తుకారాం, వసంత, సాయిప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రెంజల్‌(బోధన్‌) : మండలంలోని తాడ్‌బిలోలి శివారులో ఉన్న నిజాంసాగర్‌ కెనాల్‌ పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. నిజామాబాద్‌లోని దుబ్బ ప్రాంతంలో ఉన్న రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన డిగ్రీ ఫైనల్‌ ఇయర్‌ విద్యార్థి జల్ల అరుణ్‌కుమార్‌ మూడు రోజులు కిందట ఇంటి నుండి మయలుదేరి వెళ్లినట్లు చెప్పారు. కెనాల్‌ ఒడ్డున బైక్‌ ఉండటంతో స్థానికులు సమాచారం అందించారని పేర్కొన్నారు. శుక్రవారం మృతదేహం పైకి తేలగా పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

తమ్ముడి మృతికి కారణమైన అన్నకు జైలు

ఖలీల్‌వాడి : తమ్ముడి మృతికి కారణమైన అన్నకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. 2019లో ఏప్రిల్‌లో నగరంలోని హమల్‌వాడికి చెందిన చౌదరి దత్తును అన్న చౌదరి కిషోర్‌ కత్తితో పొడిచి హత్య చేశాడు. తాము కూలి పనిచేసిన డబ్బులు తల్లికి ఇచ్చే విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగగా అన్న కిషోర్‌ తమ్ముడు దత్తును కత్తితో పొడవగా తీవ్ర గాయాలైన దత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. కారాగార శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే ఆర్నెళ్ల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తవ్వాలి



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న స్పీకర్‌

బాన్సువాడ టౌన్‌ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఎల్లయ్య చెరువు కట్ట పక్కన నూతనంగా రూ. కోటి 66 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ పనులను పరిశీలించారు. పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కల్కి చెరువు వద్ద కొనసాగుతున్న మల్టి జనరేషన్‌, చిల్డ్రన్‌ పార్కు పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ జంగం గంగాధర్‌ తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

ఖలీల్‌వాడి : ఆరేళ్ల బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన వాగ్మారే గణపతి రాముకు మూడేళ్ల కఠిన జైలుశిక్ష, గాయపర్చినందుకు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ నిజామాబాద్‌ పోక్సో కోర్టు ఇన్‌చార్జి అదనపు జిల్లా సెషన్స్‌ జడ్జి శ్రీనివాస్‌ రావు శుక్రవారం తీర్పు చెప్పారు. నగర శివారులోని గూపనపల్లి వద్ద చెత్త ఏరుకుని జీవించే గణపతి రాముకు ఓ వితంతు మహిళ, ఆరేళ్ల కూతురితో పరిచయం ఏర్పడగా వారు కలిసి జీవిస్తున్నారు. 23 జూన్‌, 2022న రాత్రి 11.30కు ఆర్మూర్‌ రోడ్‌లోని ఓ దుకాణం వద్ద సదరు బాలికతో అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తించిన స్థానికులు చైల్డ్‌లైన్‌కు సమాచారమిచ్చారు. పోలీసులు బాలికను బాలసదన్‌కు తరలించారు. పోలీసుల తరపున పీపీ రవిరాజ్‌ వాదించారు.

క్రైం కార్నర్‌

చిల్లర నాణేల కోసం వెళ్లి..

- నీట మునిగి ఒకరి మృతి

పిట్లం(జుక్కల్‌) : మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీర నదిలో చిల్లర నాణేలు కోసం వెళ్లి బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య మృతి చెందిన సంఘటన ఒకటి శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై విజయ్‌ కొండ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య (45) గురువారం ఉదయం 11 గంటల సమయంలో మంజీరా నదిలోకి చిల్లర నాణేలను తీసుకోవడానికి నీటిలోకి వెళ్లగా అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో నీటిలోనే పడి మృతి చెందినట్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారన్నారు.

ప్రాజెక్ట్‌లో మృతదేహం వెలికితీత



పుప్పాల బాబు(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌లో గురువారం సాయంత్రం గల్లంతైన యువకుని మృతదేహాన్ని శుక్రవారం వెలికితీశారు. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన పుప్పాల బాబు(33) గురువారం సాయంత్రం ప్రాజెక్ట్‌లో గల్లంతైన విషయం విదితమే. శుక్రవారం స్థానిక జాలర్ల సాయంతో ప్రాజెక్ట్‌లో గాలించగా బాబు మృతదేహం లభ్యమైంది. గురువారం ప్రమాదవశాత్తు జారి అందులో పడిపోయాడని మృతుని భార్య రేఖ నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

1.2 కేజీల గంజాయి పట్టివేత



గంజాయి, నిందితుడితో పోలీసులు

ఖలీల్‌వాడి : నగర శివారులోని సారంగాపూర్‌ ఎక్స్‌రోడ్‌ వద్ద ఎక్సైజ్‌స్టేషన్‌ అధికారులు జరిపిన తనిఖీల్లో షైక్‌ అమీర్‌ అనే వ్యక్తి ఆటోను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా ఆటోలో 1.2 కేజీల గంజాయి దొరికిందని ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు, ఆటోను సీజ్‌ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో పాల్గొన్న ఎస్సైలు మల్లేష్‌, సింధు, సిబ్బంది షబ్బీర్‌, ప్రభాకర్‌, సంగయ్య, సాయి శాం, రవి, మోహన్‌ సింగ్‌ను అభినందించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

దోమకొండ : మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులో గత నెల 29వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న బీబీపేట మండల కేంద్రానికి చెందిన కుర్ల రాణి(30) అనే వివాహిత శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. మృతురాలు తన భర్త రాజుతో కలిసి బైక్‌పై బీబీపేటకు వెళ్తుండగా బైక్‌ డీవైడర్‌ను ఢీకొట్టిందన్నారు. దీంతో రాణి తలకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాణి, మృతిచెందగా, ఆమె తల్లి నర్సవ్వ శనివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు..

మాక్లూర్‌ : వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని గాయపడ్డ ధర్మాబాయి(77) జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. ఈనెల 14న మండలంలోని డీకంపల్లిలో ధర్మాబాయి అనే వృద్ధురాలు తన ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని గాయాలపాలైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ధర్మాబాయి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

రాంపూర్‌ గ్రామానికి చెందిన..

మండలంలోని రాంపూర్‌ గ్రామానికి చెందిన కిందింటి నర్సవ్వ(70) జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై విజయ్‌ కొండ మాట్లాడుతూ రాంపూర్‌ గ్రామానికి చెందిన కిందింటి నర్సవ్వ ఈనెల 15న తెల్లవారు జామున 4 గంటలకు తన ఇంట్లో చలి ఎక్కువగా ఉందని పొయ్యిలో మంట వేసుకుని పొయ్యి దగ్గరే పడుకోగా ప్రమాదవశాత్తు ఆమెకు మంటలు అంటుకున్నాయి. శరీరం కాలిపోవడంతో ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

‘రియల్‌’ బాధితుడికి న్యాయం చేయాలి



బాధితుడికి మద్దతు తెలుపుతున్న నాయకులు

మాక్లూర్‌ : మండలంలోని మాణిక్‌భండార్‌కు చెందిన సుంకరి లక్ష్మణ్‌కు రావాల్సిన డబ్బులను రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి నుంచి అధికారులు ఇప్పించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్‌ డిమాండ్‌ చేశారు. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి మోసం చేసి కబ్జాచేసిన వ్యవసాయ పొలంలోనే డేరా వేసుకొని బాధితుడు చేస్తున్న దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఏఐకేఎంఎస్‌ నాయకులు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువురాని సుంకరి లక్ష్మణ్‌ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కామారెడ్డికి చెందిన ఒక రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి తెలివిగా మోసం చేసి వెళ్లిపోయాడన్నారు. ప్రస్తుతం వెంచర్‌ యజమానికి ఎలాంటి సంబంధం లేకపోయినా బాధితుడు సుంకరి లక్ష్మణ్‌కు సంబంధించి 17 గుంటల భూమి మాత్రం వెంచర్‌లో కలిపేసుకున్నారన్నారు. అప్పట్లో రూ : 18 లక్షలకు బేరం కుదుర్చుకున్న కామారెడ్డికి చెందిన వ్యాపారి కేవలం రూ. లక్ష మాత్రమే భయనాగా ఇచ్చి, గుట్టు చప్పుడు కాకుండా మరో వ్యాపారికి అమ్మేశారన్నారు. బాధితుడికి రావాల్సిన రూ. 17 లక్షలను వెంటనే అధికారులు ఇప్పించాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ శంకర్‌ ఆదేశాల మేరకు ఆర్‌ఐ షఫీ బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



నిజాంసాగర్‌(జుక్కల్‌) : మంజీర నది నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు, లారీని శుక్రవారం జుక్కల్‌ పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బీర్కూర్‌ క్వారీ నుంచి పొరుగు రాష్ట్రానికి ఇసుకను తరలిస్తుండగా జుక్కల్‌ మండలం ఖండెబల్లూర్‌ వద్ద 5 టిప్పర్లు, ఒక్క లారీని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో వాహనాలను సీజ్‌ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌ : రాష్ట్రంలో కుటుంబ, నియంతపాలనకు స్వస్తి పలకాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని దుబ్బ మండలంలో ఉన్న 15వ డివిజన్‌లో శక్తికేంద్రం ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్‌ సూర్యనారాయణ మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబం బాగోతం, స్కామ్‌లు రోజుకొకటి బయటపడుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టాలని, అన్నివర్గాల సంక్షేమం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. పార్టీకి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, బూత్‌స్థాయి కార్యకర్తలే బీజేపీకి బలమని తెలిపారు. సాక్షాత్తూ సీఎం ఇచ్చిన హామీలకే అతీగతీ లేకుండా పోయిందని, ఇక నియోజకవర్గాల అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అర్బన్‌ నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయని, డివైడర్లు కట్టి, హైమాస్ట్‌ లైటింగ్‌ ఏర్పాటు చేయడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. డబుల్‌ బెడ్‌రూం ఇండ్లు కట్టినా లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో నిరుపేదలు అద్దె ఇళ్లల్లోనే జీవనం వెళ్లదీస్తున్నారని, రఘునాథ చెరువు అభివృద్ధి కలగానే మిగిలిపోయిందన్నారు. రోడ్ల విస్తరణ, క్రీడాకారులకు మైదానం, యూజీడీ, మాస్టర్‌ప్లాన్‌ అమలు, తదితర అభివృద్ధి పనులపై అర్బన్‌ ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అర్బన్‌ సహా రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్మీ రమేష్‌, నాగోళ్ల లక్ష్మీనారాయణ, నారాయణ యాదవ్‌, గడ్డం రాజు, బూత్‌ అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌ఛార్జిలు, డివిజన్‌ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యం చేయించుకుని తిరిగివస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఇరువురి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు
- ముగ్గురూ ప్రాణ స్నేహితులే..



జబ్బార్‌ (ఫైల్‌)



దినేశ్‌ (ఫైల్‌)



పోతంగల్‌ రహదారిపై రోడ్డు ప్రమాద దృశ్యం

రుద్రూర్‌/మద్నూర్‌ : కోటగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పోతంగల్‌– కోటగిరి ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా డొంగ్లీ మండలం మల్లాపూర్‌ గ్రామానికి చెందిన సాయిగొండ జబ్బార్‌, దినేశ్‌లు ఇద్దరు క్లాస్‌మేట్లు. గురువారం జబ్బార్‌ చేయి విరగడంతో అదే గ్రామానికి చెందిన స్నేహితుడు సాయిగొండ బైక్‌పై శుక్రవారం వేకువజామున మల్లాపూర్‌ నుంచి తగిలేపల్లిలో నాటు వైద్యం చేసే వ్యక్తి వద్ద కట్టు కట్టించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండ గా పనినిమిత్తం బైక్‌పై వర్ని మండలం తగిలేపల్లి గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో దుర్ఘటన జరిగింది. కోటగిరి దాటిన తర్వాత ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేస్తుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ ఢీకొనడం వల్ల అదుపు తప్పి పడిపోయారు. వారి తలలకు బలమైన గాయాలు కావడంతో దినేశ్‌ (33), జబ్బార్‌ (35) అక్కడికక్కడే మృతి చెందారు. మరొక యువకుడు సాయిగొండకు తీవ్రగాయాలు కాగా 108లో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని రుద్రూర్‌ సీఐ జాన్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. జబ్బార్‌కు భార్య రిజ్వానా అమ్రిన్‌ (6), నస్రీన్‌(4) అనే ఇద్దరు పిల్లలు, రిజ్వానా ఎనిమిది నెలల గర్భవతి అని కుటుంబీకులు తెలిపారు.

నగల కోసమే వృద్ధురాలి హత్య

- ఇద్దరు నిందితుల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు

ఆర్మూర్‌టౌన్‌ : ఆలూర్‌ మండల కేంద్రానికి చెందిన కొత్తుర్‌ గంగ (65) హత్య కేసును పోలీసు చేధించారు. ఆర్మూర్‌ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు నిందితుల వివరాలను వెల్లడించారు. ఆలూర్‌ గ్రామానికి చెందిన గంగ ఇంట్లో తరుచు జరుగుతున్న గొడవల గురించి అదే గ్రామానికి చెంది వెంకటితో గోడు వెల్లబోసుకునేది. ఇదే అదనుగా భావించిన వెంకటి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు నగలపై కన్నేశాడు. గొడవలను పరిష్కరించడానికి మంత్ర పూజలు చేయాలని వృద్ధురాలిని నమ్మించాడు. గతేడాది సెప్టెంబర్‌లో వెంకటి తన మిత్రుడు కడమంచి సురేష్‌తో కలిసి వృద్ధురాలిని ఆర్మూర్‌ మండలం మగ్గిడి శివారులో శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ బ్యాక్‌ వాటర్‌ వద్దకు తీసుకెళ్లి ఆమె చీరకొంగుతోనే హత్య చేసి ఒంటిపైన ఉన్న నగలతో పారిపోయారు. కేసు నమోదు చేసుకొని ఏసీపీ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఆలూర్‌లో వెంకటి ఇంటి వద్ద ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ తరలించారు. వృద్ధురాలి నుంచి చోరీ చేసిన బంగారు ముత్యాల గుండ్లు 25 గ్రాములు, 22 గ్రాముల నల్లపూసల గుండ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు చేదించిన వారిలో ఏఎస్సై గఫార్‌, సిబ్బంది గంగాప్రసాద్‌, ప్రసాద్‌కు రివార్డులిచ్చారు.

బీఈడీ ప్రాక్టికల్‌ పరీక్షలు వాయిదా వేయండి



తెయూ కంట్రోలర్‌కు విన్నవిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 20, 21న జరుగనున్న బీఈడీ ప్రాక్టికల్‌ పరీక్షలను వాయిదా వేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెయూ కంట్రోలర్‌ అరుణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్‌ మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 24వరకు దేశవ్యాప్తంగా యూజీసీ నెట్‌ పరీక్షలు ఉన్నాయన్నారు. వర్సిటీ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరువుతారని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బీఈడీ ప్రాక్టికల్‌ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. స్పందించిన కంట్రోలర్‌ పరీక్షలను వాయిదా వేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రీ –షెడ్యూల్‌ ప్రకటిస్తామన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే అఫ్రర్‌, మహిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో దొంగల హల్‌చల్‌

- బైక్‌ను దొంగిలించిన దుండగులు
- సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు



బైక్‌ను చోరీ చేసి తీసుకెళ్తున్న దుండగుడు

పిట్లం(జుక్కల్‌) : మండలంలోని రాంపూర్‌ గ్రామంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌ చల్‌ చేశారు. గ్రామంలో పలువురి ఇళ్ల ఎదుట ఉన్న బైక్‌లను దొంగిలించడానికి ప్రయత్నించారు. సర్పంచ్‌ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి దొంగలు గ్రామంలోకి వచ్చి పలువురి ఇళ్ల ముందు ఉన్న బైక్‌లను దొంగిలించడానికి ప్రయత్నించారు. గ్రామంలోని ఐదు బైక్‌ల తాళాలు పగలగొట్టడానికి ప్రయత్నించారని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ రాజిరెడ్డి బైక్‌ తాళం తెరుచుకోవడంతో అతని బైక్‌ను దొంగలించారన్నారు. గ్రామంలోని బ్యాంక్‌ వద్ద ఉన్న సీసీ కెమెరాలో బైక్‌ను చోరీచేసి తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ విషయంపై పిట్లం పోలీసులకు సమాచారం ఇచ్చామని సర్పంచ్‌ తెలిపారు. అర్ధరాత్రి దొంగల హల్‌చల్‌తో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో దొంగతనాలు జరుగకుండా పోలీస్‌ పెట్రోలింగ్‌ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ నాయకులపై దాడి



దాడిలో గాయపడ్డ బీజేపీ నాయకులు

వర్ని : మండలంలోని చింతల్‌ పేట్‌ గ్రామంలో తమపై బీఆర్‌ఎస్‌ నాయకులు దాడి చేసినట్లు బీజేపీ నాయకులు వర్ని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం చింతలపేట గ్రామంలో బీజేపీ కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించారు. సమావేశం అనంతరం రాష్ట్ర దిశ కమిటీ సభ్యులు ముఖ్య అతిథి అడ్లూరి శ్రీనివాస్‌ వర్ని మండల బీజేపీ అధ్యక్షుడు ఈశ్వెం శంకర్‌, మాజీ జెడ్పీటీసీ రంజానాయక్‌ నాయకులు స్థానిక బూత్‌ కమిటీ, గ్రామ కమిటీ కార్యకర్తలతో తిరిగి వస్తుండగా వర్ని జెడ్పీటీసీ హరిదాసు అతని కుమారుడు రాంసింగ్‌ బీజేపీ నాయకులపై దాడికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకుల దాడిలో బీజేవైఎం మండల అధ్యక్షులు ఉదయ్‌ సింగ్‌, పైడిమల్‌ బూత్‌ కమిటీ అధ్యక్షులు ఆకారం సాయిబాబాలు గాయాలపాలైనట్లు ఫిర్యాదులు పేర్కొన్నారు.